సాక్షి
వికారాబాద్
శనివారం, 2 ఆగస్టు, 2025



అక్రమార్కులపై కొరడా

తాండూరు మండలంలో ఎర్రరాయి తరలిస్తున్న అక్రమార్కులపై అధికారులు కొరడా ఝుళిపించారు. 8లో▸



ఎల్‌పీజీ మంజూరు చేయండి

కొడంగల్ నియోజకవర్గానికి ఎల్‌పీజీ పెట్రోల్ పంపులు మంజూరు చేయాలని ఎంపీ డీకే అరుణ కేంద్రాన్ని కోరారు. 8లో▸



సమస్యలు పరిష్కరించాలి

విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం కోరారు. 9లో▸

నాణ్యత నై..!



యాలాల మండలం తాండూరు - కొడంగల్ మార్గంలో కాగ్నా నది వంతెనపై ఏర్పడిన గుంతలు

ప్రారంభించిన కొన్నేళ్లకే దెబ్బతింటున్న బ్రిడ్జిలు

- ఏడాదికే పాడైన గాజీపూర్ - బుద్దారం వంతెన
- రెండేళ్లలోపే తాండూరు - కొడంగల్ మార్గంలోని బ్రిడ్జికి రంధ్రం
- పనులపై పర్యవేక్షణ కరువు
- కాంట్రాక్టర్లు చేసిందే పని.. చెప్పిందే వేదం

వికారాబాద్: పై ఫొటోలో కనిపిస్తున్న బ్రిడ్జి యాలాల మండల పరిధిలో తాండూరు - కొడంగల్ మార్గంలో తొమ్మిదేళ్ల క్రితం నిర్మాణ పనులు ప్రారంభించారు. ఏడేళ్ల పాటు పనులు కొనసాగుతూ వచ్చాయి. రూ.16.80 కోట్లు వెచ్చించి రెండేళ్ల క్రితం (2022 చివరి నాటికి) పూర్తి చేశారు. నాటి నుంచి వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. వారం రోజుల క్రితం బ్రిడ్జికి రంధ్రం పడింది. వందేళ్లపాటు ఉండాల్సిన వంతెన రెండేళ్లకే పాడవడం అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో ఇట్టే అర్థం అవుతుంది. దెబ్బతిన్న బ్రిడ్జిని పరిశీలించి అధికారులు మరమ్మతులు చేయలేదు. బ్రిడ్జి నాణ్యతపై పూర్తి స్థాయి విచారణ జరిపించడంతోపాటు సంబంధిత కాంట్రాక్టర్, పర్యవేక్షించిన ఇంజనీర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పక్క ఫొటోలోని వంతెనను ఒక్కసారి పరిశీలిస్తే పనుల్లో నాణ్యత ఏ మేరకు పాటిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పన క్కర్లేదు. తాండూరు డివిజన్ పరిధిలోని పెద్దేముల్ మండల కేంద్రానికి కిలో మీటరు దూరంలో గాజీపూర్ -బుద్దారం మార్గంలో రూ.3.30 కోట్లు వెచ్చించి ఈ వంతెన నిర్మించారు. ఐదేళ్ల క్రితం పనులు ప్రారంభించి ఏడాదిన్నర క్రితం(2023 చివరి నాటికి) అందుబాటులోకి తెచ్చారు. కనీసం ఏడాది తిరక్కుండానే పాడైంది. బ్రిడ్జి మొత్తం సిమెంట్ ఊడిపోయి లోపలి స్టీల్ కనిపిస్తోంది. ఇవి ఉదాహరణకు మాత్రమే. జిల్లాలో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన చాలా వంతెనలు ఇదే పరిస్థితిలో ఉన్నాయి.



పెద్దేముల్ సమీపంలో ఏడాదిన్నరకే దెబ్బతిన్న బ్రిడ్జి

పరిశీలిస్తాం

నాణ్యత విషయంలో రాజీ పడం. నిబంధనల ప్రకారమే పనులు జరుగుతాయి. ఎక్కడైనా నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటాం. పెద్దేముల్ సమీపంలో వంతెన దెబ్బతిన్న మాట వాస్తవమే. దాన్ని రెక్టిఫై చేస్తాం. తాండూరు సమీపంలోని బ్రిడ్జి ఒక్కచోటే దెబ్బతింది. దాన్ని బాగు చేయిస్తాం.

– లాల్‌సింగ్, ఈఈ, ఆర్‌అండ్‌బీ

మచ్చుకైనా కనిపించని నాణ్యత

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఏమాత్రం పాటించడం లేదు. వందేళ్ల పాటు దృఢంగా ఉండాల్సిన నిర్మాణాలు ఏడాది రెండేళ్లకే పాడవుతున్నాయి. పనులేవైనా పర్సెంటేజీలే పరమావధిగా అధికారుల తీరు కొనసాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. కిందిస్థాయి సిబ్బందిని మొదలుకొని జిల్లా స్థాయి అధికారులు, చివరకు క్వాలిటీ కంట్రోల్ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్లు నిబంధనలకు నీళ్లొదిలి నాసిరకం పనులు చేసి మమా అనిపిస్తున్నారు. నాణ్యతను పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడకుండానే బిల్లులు చేసి కాంట్రాక్టర్లకు సహకరిస్తున్నారు.

సరైన మోతాదులో వాడని మెటీరియల్

అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు సరైన మోతాదులో మెటీరియల్ వాడటం లేదు. ఇసుక స్థానంలో డస్టు వినియోగిస్తున్నారు. చాలా చోట్ల 20 శాతం ఇసుక 80 శాతం డస్టు వాడుతున్నారు. అధికారులు చేస్తున్న అంచనాల్లో మాత్రం ఇసుకనే కోడ్ చేస్తున్నారు. మార్కెట్‌లో లారీ డస్ట్ రూ.9 వేల నుంచి రూ.10 వేలకు దొరుకుతుంది. అదే ఇసుక అయితే రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. డస్ట్, ఇసుక ధరల్లో భారీ వ్యత్యాసం ఉండటంతో కాంట్రాక్టర్లు ఇసుక స్థానంలో డస్ట్ వాడుతున్నారు. దీంతో కొన్నేళ్లకే నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. స్టీలు ఇతర సామగ్రి కూడా తగినంత మోతాదులో వాడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం నిరుపయోగంగా మారుతోంది.



గిరిజన బాలికల వసతి గృహంలో శ్రమదానం చేస్తున్న మీనాక్షి నటరాజన్, పార్టీ శ్రేణులు

కార్యకర్తల కృషితోనే అధికారం

- ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్
- పరిగి గిరిజన గురుకులంలో శ్రమదానం
- పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్

పరిగి/దోమ: కార్యకర్తల కృషి, శ్రమతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. శుక్రవారం పరిగి పట్టణ పరిధిలోని గిరిజన బాలికల పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి శ్రమదానం చేశారు. జనహిత పాదయాత్రలో భాగంగా మీనాక్షి నటరాజన్ గురువారం సాయంత్రం పరిగికి చేరుకున్నారు. రాత్రి స్థానిక ఎస్ గార్డెన్‌లో బస చేశారు. ఉదయం బాలికల పాఠశాలను సందర్శించి మొక్కలు నాటారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని ఎస్‌గార్డెన్ చేరుకొని చరకతో నూలు తయారు చేశారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మాగాంధీని గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ గాంధీ మార్గాన్ని అనుసరించాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సత్తా చాటాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఎస్ గార్డెన్‌లో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో పార్టీ పటిష్టంగా ఉండాలంటే నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. భేదాభిప్రాయాలు లేకుండా అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని చెప్పారు. కార్యకర్తల సేవలకు గుర్తింపు ఉంటుందన్నారు. ఇందిరమ్మ కమిటీల్లో వారికి ప్రాధాన్యత కల్పించినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదే అన్నారు. అందరూ శ్రమిస్తే స్థానిక ఎన్నికల్లో ఎక్కువ సీట్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, ఎమ్మెల్యేలు పర్నికారెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, యాదయ్య, బుయ్యని మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమం

అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసిందన్నారు. గత ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి ఇక్క ఇల్లు కూడా కట్టించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ప్రతి నియోజకవర్గానికీ 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

'జుంటుపల్లి' అభివృద్ధికి రూ.5.71 కోట్లు మంజూరు



జుంటుపల్లి ప్రాజెక్టు

యాలాల: మండలంలోని జుంటుపల్లి ప్రాజెక్టు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5.71 కోట్లను మంజూరు చేసింది. ఇరిగేషన్ శాఖ సాధారణ పరిపాలన విభాగం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాజెక్టుతోపాటు కుడి, ఎడమ కాల్వల మరమ్మతులు, అభివృద్ధి పనులకు ఈ నిధులు ఖర్చు చేయనున్నారు. జిల్లా అధికారులు రూ.6.80 కోట్లతో ప్రతిపాదనలు పంపగా రూ.5.71 కోట్లు మంజూరయ్యాయి.

భోజనం తయారీలో రాజీవద్దు

కలెక్టర్ ప్రతీక్‌జైన్



ఆదర్శ పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

నవాబుపేట: వసతి గృహాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కేజీబీవీ, బీసీ వసతి గృహాన్ని సందర్శించారు. భోజనం, వసతులపై ఆరా తీశారు. భోజనం విషయంలో రాజీ పడరాదన్నారు. ఆగస్టు 15లోగా బీసీ వసతి గృహ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఇంగ్లిష్‌లో మాట్లాడటం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బుచ్చయ్య, ఎంపీడీఓ అనురాధ, ప్రిన్సిపాళ్లు కృష్ణకుమార శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం, రైతు సంఘం నాయకులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. డబుల్ ఇళ్ల ఆశ చూపి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా పేదలకు పంపిణీ చేయడం లేదన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాస్, మహిపాల్, సతీష్, రాములు, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. బేగంపేట, రామంతాపూర్‌లోని స్కూళ్లలో 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం ఎస్సీ, ఎస్టీ బాలబాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8లోపు దరఖాస్తులు పంపాలని సూచించారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 86393 88553, 99085 98481లో సంప్రదించాలని కోరారు.

నేడు కేంద్ర మంత్రి రాక

యాచారం: కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి శనివారం మండలానికి రానున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం జిల్లా శాస్త్రవేత్త శ్రీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఉత్తరప్రదేశ్‌లోని వారాణాసిలో పీఎం కిసాన్ 20వ విడత నిధులు విడుదల చేస్తున్న సందర్భంగా యాచారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగే కార్యక్రమంలో వీడియో ప్రసంగం వీక్షించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో కేంద్రమంత్రితో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొంటారని చెప్పారు.



నిర్వాసితులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఇతర అధికారులు

నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- ఇళ్లు కోల్పోయే వారికి స్థలం.. పరిహారం చెల్లిస్తాం
- కొడంగల్ శ్రీవారి ఆలయ విస్తరణకు సహకరించాలి
- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్
- నేడు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాక

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇళ్లు, ఇంటి స్థలాలు కోల్పోతున్న వారందరికీ న్యాయం చేస్తామని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ హామీ ఇచ్చారు. శుక్రవారం పట్టణంలోని కడా కార్యాలయంలో నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విస్తరణలో భాగంగా ఆలయం చుట్టూ ఉన్న ప్రైవేటు స్థలాన్ని సేకరించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు. 96 మంది నుంచి 8,736 గజాల స్థలం సేకరించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వాసితుల అభిప్రాయాలు సేకరించారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఇల్లు కోల్పోతున్న వారికి పరిహారం చెల్లిస్తామన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇంటి విలువను లెక్క కడతారని తెలిపారు. స్థలం, భవనం విలువ లెక్క కట్టి పరిహారం చెల్లిస్తామన్నారు. దీనికి అదనంగా రూ.5 లక్షల సాయం, ఒక ఏడాది కుటుంబ అవసరాల కోసం రూ.40 వేలు, ఇల్లు ఖాళీ చేసి వెళ్లడానికి అయ్యే ఖర్చు (ట్రాన్స్‌పోర్ట్)రూ.60 వేలు, పశువుల దొడ్డి నిర్వహణకు రూ.25 వేలు, చేతి వృత్తులు, కుల వృత్తుల వారికి రూ.30 వేలు, ఇతర ఖర్చుల కోసం రూ.60 వేలు చెల్లిస్తామన్నారు. పట్టణంలోని జాతర స్థలంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెంచర్‌లో ఇంటి స్థలం కేటాయిస్తామని, ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఆలయ ఈఓ రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఐ సత్యనారాయణ, ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్, రత్నం, మధు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విస్తరణకు సర్కారు సానుకూలత

పేదల తిరుపతిగా పేరుగాంచిన వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ సర్కార్ సానుకూలంగా ఉంది. ఆలయాన్ని విస్తరించి మౌలిక సదుపాయాలు కల్పించడానికి టీటీడీతోపాటు రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆలయ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, మాఢ వీధుల విస్తరణపై దృష్టి పెట్టారు. క్యూ లైన్, కల్యాణ మండపం, కల్యాణ కట్ట, పూజా మందిరాలు, వసతి గదులు, భక్తుల సౌకర్యార్థం స్నాన ఘట్టాలు, మరుగుదొడ్లు, పార్కింగ్ తదితర వాటిని నిర్మిస్తారు. రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, ఎండోమెంట్ కమిషనర్ వెంకట్‌రావు, వాస్తు నిపుణుడు సపథి, ఇతర ఉన్నతాధికారులు శనివారం కొడంగల్ శ్రీవారి ఆలయానికి రానున్నట్లు ఆలయ ఈఓ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

నేడు ఎమ్మార్పీఎస్ మహాగర్జన



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

- కొడంగల్‌లో బహిరంగ సభ
- హాజరుకానున్న మందకృష్ణ మాదిగ
- విజయవంతం చేయాలని నేతల పిలుపు

కొడంగల్: పట్టణంలోని మురహరి ఫంక్షన్ హాల్‌లో శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మహా గర్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున్ మాదిగ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జాతీయ గౌరవ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, అందె రాంబాబు, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు, జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ, పిల్లికండ్ల ఆనంద్ మాట్లాడారు. మహా గర్జనకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు చెప్పారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల నాయకులు ప్రకాశ్, అంజి, రమేష్‌బాబు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల కలను సాకారం చేస్తాం

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ



మహిళలకు రేషన్‌కార్డు మంజూరు పత్రాలు అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు: మండల ప్రజల చిరకాల వాంఛ జూనియర్ కళాశాల అని దాన్ని అతి త్వరలో సాకారం చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హామీ ఇచ్చారు. శుక్రవారం ధారూరు రైతు వేదికలో కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోట్‌పల్లి వద్ద ఏర్పాటు చేయనున్న 220 కేవీ సబ్ స్టేషన్ ధారూరు మండలానికి కూడా ఉపయోగ పడుతుందన్నారు. ఉపాధి హామీ పథకం కింద వికారాబాద్ నియోజకవర్గానికి రూ.15 కోట్లు తెచ్చానని, అందులో రూ.6 కోట్లు వెనక్కి వెళ్లినట్లు తెలిపారు. ప్రతిపాదనలు పంపితే ఆ నిధులు వచ్చేలా చూస్తానని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరును చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా మహిళా సంఘాలకు రూ.20 వేల కోట్లు వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కన్న కలలను సీఎం రేవంత్ రెడ్డి సాకారం చేస్తున్నరని తెలిపారు. మండలానికి 451 కొత్త రేషన్‌కార్డులు మంజూరైనట్లు చెప్పారు. కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు కడుతూనే రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో సన్న బియ్యం ఇస్తున్న రాష్ట్రం మనదే అన్నారు. దెబ్బతిన్న రోడ్లను రూ.600 కోట్లతో బాగుచేయిస్తున్నట్లు వివరించారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 8 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సుదర్శనమ్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, తహసీల్దార్ సాజిదాబేగం, డీటీ విజయేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ నర్సింహులు, నాయకులు రాములు, కిరణ్, మహ్మద్ బాబాఖాన్, హన్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బంట్వారానికి స్పీకర్ రాక

బంట్వారం: మండల కేంద్రమైన బంట్వారానికి శనివారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అధికారులు, పార్టీ నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

కుర్మ సంఘం భవనానికి శంకుస్థాపన

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని బిల్లదాకలలో రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించే కుర్మ సంఘం భవనానికి శుక్రవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు నుంచి రూ.కోటి మంజూరు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, కుర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, గౌరె కాపరుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సదానందం, పీఆర్ ఈఈ ఉమేష్‌కుమార్, ఆర్‌టీఏ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏం చేశారని పాదయాత్ర?

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి
- మీనాక్షి నటరాజన్‌కు ప్రశ్నల వర్షం



విలేకరులతో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

అనంతగిరి: జిల్లాకు ఏం చేశారని పాదయాత్ర చేస్తున్నారో ప్రజలకు చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సీఎం సొంత జిల్లా వికారాబాద్‌కు చేసిందేమీలేదని ఆరోపించారు. శుక్రవారం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీరు ఏ ఎజెండాతో పాదయాత్ర చేస్తున్నారో జిల్లా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కాకుండా మీరేందుకు పాదయాత్ర చేస్తున్నారు అనే దానిపై ప్రజలకు సందేహాలు ఉన్నాయన్నారు. అనంతగిరి టూరిజం అభివృద్ధిపై ఏమైనా మాట్లాడుతారా అని ప్రశ్నించారు. హైదరాబాద్ – మన్నెగూడ రోడ్డు విస్తరణ పనులు ఎందుకు కావడం లేదో ప్రజలకు చెప్పాలన్నారు. మీరు పాదయాత్ర చేసే మార్గంలో నేషనల్ హైవే కాకుండా గుంతలు లేని రోడ్డు చూపించగలరా అని అన్నారు. ప్రజాప్రతినిధులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లుల విడుదల విషయంలో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్ర ప్రజల్లో విశ్వాసం కోల్పోయినందుకా.. లేక ప్రజాదారణ తగ్గిందని చేస్తున్నారా అనే సందేహం చాలా మందిలో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని నమ్మదని, కుటుంబ పాలనను నమ్ముతుందన్నారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఏమయ్యిందో ప్రజలకు చెప్పాలన్నారు. ఆరు గ్యారంటీల అమలు చేయడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ పాలనలో దళారీ వ్యవస్థ పెరిగి రైతులకు యూరియా కొరత సృష్టిస్తోందని మండిపడ్డారు. మహిళలకు రూ.2500, నిరుద్యోగ భృతి, పెన్షన్ల పెంపు, ఉద్యోగాల భర్తీ ఎందుకు అమలు చేయలేదో చెప్పాలన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి, దిశా కమిటీ సభ్యుడు వడ్ల నందు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నవీన్‌కుమార్, పార్లమెంట్ కో– కన్వీనర్ అమరేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శివరాజుగౌడ్, జిల్లా నాయకులు రాజు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎల్‌పీజీ మంజూరు చేయండి

ఎంపీ డీకే అరుణ



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న డీకే అరుణ

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గానికి ఎల్‌పీజీ పెట్రోల్ పంపులు మంజూరు చేయాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్ పర్సన్ డీకే అరుణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో కేంద్ర పెట్రోలియం శాఖామంత్రి హరిదీప్ సింగ్‌పూరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని కొడంగల్ నియోజకవర్గంలో ఎల్‌పీజీ పంపు లేదని మంత్రికి వివరించారు. ఈ ప్రాంత ప్రజలకు ఎల్‌పీజీ, పెట్రోల్ పంపులు అందుబాటులోకి తేవాలని కోరారు.

నేడు హిందూ ఉత్సవ సమితి భవనానికి శంకుస్థాపన



హిందూ ఉత్సవ సమితి భవన నిర్మాణం కోసం చదును చేసిన భూమి

తాండూరు: పట్టణంలో హిందూ ఉత్సవ సమితికి కేటాయించిన రెండెకరాల స్థలంలో పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి గురువారం శంకుస్థాపన చేయనున్నారు. రూ.50 లక్షలతో చేపట్టనున్న భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి కుల సంఘాల సభ్యులు, హిందు ఉత్సవ సమితి ప్రతినిధులు, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింలు కోరారు.

ఇసుక పర్మిషన్ ఇస్తాం

తహసీల్దార్ గోవిందమ్మ



ఇసుక డంపుల వద్ద ఆర్‌ఐ

దోమ: ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక పర్మిషన్‌ను ఇస్తామని తహసీల్దార్ గోవిందమ్మ స్పష్టం చేశారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో ఇందిరమ్మకు ఇసుక గండం అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు మండల రెవెన్యూ గిర్దవారు(ఆర్‌ఐ) సుదర్శన్‌తో పర్మిషన్ ఇస్తామని తహసీల్దార్ చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అర్హులైన వారు పంచాయతీ కార్యదర్శి, హౌసింగ్ ఏఈలతో సంతకాలు సేకరించి తమ వద్దకు వస్తే ఇసుక పర్మిషన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫేషియల్ రికగ్నిషన్‌తో ఇబ్బందులు

అనంతగిరి: ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ (ముఖ ఆధారిత హాజరు) సిస్టంతో ఉపాధ్యాయులు అవస్థలు పడే అవకాశం ఉందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, అమర్‌నాథ్ ఓ ప్రకటనలో ఆరోపించారు. ఉపాధ్యాయులకు ఇబ్బంది కలిగేలా ఈ నియమం ఉందన్నారు. ఉపాధ్యాయులకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చి, విద్యార్థుల ఉన్నతికి ఉపయోగపడే ఏ అంశాన్నైనా స్వాగతిస్తామన్నారు. కానీ గురువుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్న ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టంతో తొందర వెళ్లే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. దాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు.

ఎంఐఎం జిల్లా అధ్యక్షుడిగా హాదీ



నూతన కమిటీ సభ్యులు

అనంతగిరి: ఎంఐఎం వికారాబాద్ జిల్లా నూతన అధ్యక్షుడిగా అబ్దుల్ హాదీ ఎన్నికయ్యారు. పార్టీ అధినాయకుల సూచన మేరకు సమద్ బిన్ అబ్దాద్ సాబ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా హాదీతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఫిరోజ్ బేగ్, జాయింట్ సెక్రటరీలుగా బహాద్దీన్ గుల్షాన్, అలీమొద్దీన్, అబ్దుల్ సమద్, మహ్మద్ అలీం, బుర్హాన్ జునైదీ, మోయిజ్ ఖురేషీ, కోశాధికారిగా ఎండీ మహబూబ్, ఎగ్జిక్యూటీవ్ సభ్యులుగా ఎండీ సర్తాజ్ హుస్సెన్, ఎండీ ఇన్యాతుల్లా షరీఫ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతానన్నారు.

అక్రమార్కులపై కొరడా

- ఎర్రరాయి తరలిస్తున్న వాహనాల పట్టివేత
- ఏడుగురిపై కేసు నమోదు
- పెద్దేముల్‌లో టాస్క్‌ఫోర్స్ దాడులు



టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న జేసీబీ, ట్రాక్టర్లు

తాండూరు రూరల్: ఎర్రరాయి తరలిస్తున్న అక్రమార్కులపై అధికారులు కొరడా ఝళిపించారు. పెద్దేముల్ మండలం తట్టిపల్లి, పాషాపూర్ తండా పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న వాహనాలపై శుక్రవారం తెల్లవారుజామున టాస్క్‌ఫోర్స్ సీఐ అన్వర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఇద్దరు జేసీబీ డ్రైవర్లు, ఐదుగురు ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. సీఐ కథనం ప్రకారం.. పెద్దేముల్ మండలం అడికిచెర్ల, పాషాపూర్ తండా సమీపంలోని ప్రభుత్వ భూముల్లో కొందరు ఎర్రమట్టి రాయిని తయారు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టి రాయిని ట్రాక్టర్ల ద్వారా కర్ణాటకకు తరలిస్తున్నారు. ఇందులో జేసీబీ డ్రైవర్లు మన్నె ప్రవీణ్, రాథోడ్, ట్రాక్టర్ డ్రైవర్లు రాథోడ్ మోహన్, పెద్దేముల్ రవి, తల్వార్ శరణ్, చించోళి సుభాష్, మూర్తిలపై పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. రెండు జేసీబీ, ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

మాజీ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో

ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టిరాయి అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్నారు. చుట్టు పక్కల తండాకు చెందిన ఓ గ్రామస్థాయి మాజీ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. ట్రాక్టర్ల సహాయంతో కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎర్రరాయి తవ్వకాల అక్రమార్కులపై టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించడంతో తట్టెపల్లి, పాషాపూర్‌తండాలో కలకలం రేగింది.

గాంధీజీ సిద్ధాంతమే మూలం



పరిగి: చెరకతో నూలు వడుకుతున్న మీనాక్షి నటరాజన్

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్

పరిగి: మహాత్మా గాంధీ సిద్ధాంతమే కాంగ్రెస్ పార్టీకి మార్గదర్శకమని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. జనహిత పాదయాత్రలో భాగంగా శుక్రవారం పరిగిలో ఆమె మహిళా కార్యకర్తతో మాట్లాడుతూ.. చెరకతో నూలు వడికి ఉత్సాహ పరిచారు. చరక ద్వారా స్వదేశీ ఉద్యమాన్ని గుర్తు చేస్తూ స్వయం ఉపాధికి చిహ్నమని సూచించారు. చెరక ఉపయోగించే విధానాన్ని నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ద్వారా మహిళాల నాయకురాళ్లకు వివరించారు. చేనేత వస్త్రాలు వాడడంతో ఆరోగ్యానికి మేలు కలుగుతుందని, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం దేశ ఆర్థిక పురోగతికి దోహదం అన్నారు.

పుస్తకం అందజేత



దోమ: మీనాక్షి నటరాజన్‌కు పుస్తకం అందజేస్తున్న మాజీ ఎంపీపీ

దోమ: మహాత్రియా రా రచించిన పోస్ట్ చేయని లేఖ(అన్‌పోస్టేడ్ లేటర్) పుస్తకాన్ని మీనాక్షి నటరాజన్‌కు దోమ మండల మాజీ ఎంపీపీ అనసూయ అందజేశారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో నిర్వహించి జనహిత పాదయాత్ర సభలో ఆమెకు ఈ బుక్‌ను బహూకరించారు. ప్రతి ఒక్కరూ అన్‌పోస్టేడ్‌లేటర్‌ను చదివేందుకు కృషి చేయాలని మాజీ ఎంపీపీ ఆశించారు.

నేడు ఎస్‌ఏ ప్రమోషన్‌కు పత్రాల పరిశీలన

అనంతగిరి: జిల్లాలో స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ) పోస్టు ప్రమోషన్‌కు శనివారం ఉపాధ్యాయులకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని జిల్లా విద్యాధికారి రేణుకదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, ఒరిజినల్ సర్వీస్ బుక్, అనెగ్జర్‌ను పూర్తి చేసుకుని డీఎస్సీ అపాయింట్‌మెంట్ వారీగా వెరిఫికేషన్‌కు హాజరుకావాలని సూచించారు.

నిరుపేద కుటుంబానికి సీఎం అండ

పరిగి: నిరుపేద కుటుంబానికి సీఎం రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. గురువారం పరిగిలో నిర్వహించిన జనహిత పాదయాత్రలో భాగంగా.. స్థానిక గంగపుత్ర శ్మశానవాటిలో తలదాచుకున్న ఓ కుటుంబం దీనగాథను మీడియా ద్వారా తెలుసుకున్న ఆయన అభాగ్యులను ఆదుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు శుక్రవారం అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. పట్టణానికి చెందిన నారాయణ, అతని కుమారుడు వెంకటయ్య, కోడలు, మనవడు నాలుగు నెలలుగా ఇక్కడే ఉంటున్నారని తెలుసుకున్నారు. వీరికి ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని తెలిపారు. బాలుడిని గురుకుల పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పర్మిట్‌రూమ్‌లో వ్యక్తి మృతి

పరిగి: మద్యం తాగేందుకు పర్మిట్ రూమ్‌లోకి వెళ్లిన ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఈ ఘటన పరిగి పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం గ్రామానికి చెందిన మొగులయ్య(36) మద్యం తాగేందుకు పరిగి బస్టాండ్ ఎదురుగా ఉన్న లక్ష్మీ వైన్స్‌కు వచ్చాడు. మద్యం తీసుకుని పర్మిట్ రూమ్‌లోకి వెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత మొగులయ్య చనిపోయినట్లు గమనించిన నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం బాడీని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మహిళా రైతుపై కేసు నమోదు

బషీరాబాద్: మండలంలోని మైల్వార్ పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతివనంలో చెట్లు నరికి సాగు చేస్తున్నారని గ్రామ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదుతో మహిళా రైతుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ నుమాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మెతుకు బసమ్మ అనే రైతు గ్రామ సమీపంలోని సర్వేనంబర్ 235లో 10 ఎకరాల భూమిలో సాగుకోసం చిన్నచిన్న చెట్లను తొలగించింది. అయితే భూమి గ్రామ పంచాయతీకి చెందిందని గ్రామ కార్యదర్శి బాయికాడి నర్సిములుగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ తిరుమల స్వామి, రెవెన్యూ అధికారులు కూడా సదరు భూమి పంచాయతీకి చెందిన ప్రకృతివనమేనని తేల్చారు. విచారణ జరిపిన ఎస్‌ఐ బసమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

తమ్ముడిపై పారతో దాడి

మద్యం మత్తులో అన్న నిర్వాకం

కుల్కచర్ల: తండ్రిపై దాడిని అడ్డుకున్న తమ్ముడిపై సొంత అన్న పారతో విరుచుకుపడిన సంఘటన చౌడాపూర్ మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విఠలాపూర్ గ్రామానికి చెందిన కమ్మరి ఆంజనేయులు(68)పై పెద్ద కుమారుడు మహేశ్(31) మద్యం మత్తులో దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న చిన్న కుమారుడు హరీష్ అన్నను మందలించాడు. నాన్నని ఎందుకు కొడుతున్నావు? ఎందుకు తిడుతున్నావు? అని ప్రశ్నించగా.. మద్యం మత్తులో ఊగిపోయిన మహేశ్ పారతో హరీష్ తలపై దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలైన అతను పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

క్షతగాత్రుడికి స్పీకర్ పరామర్శ



గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి పట్ల శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మానవత్వాన్ని చాటుకున్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన ధారూరు రైతు వేదికలో కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేసి తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. అనంతగిరి చివరిగుట్ట రోడ్డు పక్కన ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి కన్పించాడు. వెంటనే తన కాన్వాయ్‌ని నిలిపివేయించి క్షతగాత్రుని వద్దకు చేరుకుని ఆరా తీశారు. ముందుగా గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేయించి, 108కు ఫోన్ చేయించారు. అతనికి మెరుగైన చికిత్స అందించేలా చూడాలని డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. అంబులెన్స్ తొందరగా రాకపోవడంతో క్షతగాత్రున్ని పోలీసు వాహనంలో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

న్యాయవాదులందరూ ఏకమవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథ్

హైకోర్టు సీనియర్ అడ్వకేట్ రఘునాథ్

అనంతగిరి: అందరూ ఏకమైతే అడ్వకేట్ల రక్షణ చట్టం అమలవుతుందని హైకోర్టు సీనియర్ న్యాయవాది రఘునాథ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్ బార్ అసోసియేషన్‌లో ఏర్పాటు చేసిన న్యాయవాదుల సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. న్యాయవాదులకు రక్షణ చట్టం అమలులో లేనందున దాడులు మరింత పెరిగాయని, ఎక్కడో ఒక చోట నిత్యం దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఇచ్చే 41ఎ స్టేషన్ బెయిల్‌లతో న్యాయవాదులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఈ విషయంలో ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బస్వరాజ్ పటేల్, ఉపాధ్యక్షుడు శంకరయ్య, సెక్రటరీ వెంకట్ రెడ్డి, న్యాయవాదులు గోవర్ధన్ రెడ్డి, సంపూర్ణనంద్, గోపాల్‌రెడ్డి, కమాల్‌రెడ్డి, శ్రీనివాసరావు, యాదవ రెడ్డి, వసుందర, మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

అత్తాపూర్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని ఆరు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అత్తాపూర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రవి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొత్తూరు మండలం, పింజెర్ల గ్రామానికి చెందిన నిర్మలమ్మ ఇటీవల నందిముస్లాయిగూడలో ఉంటున్న తన తల్లిని చూసేందుకు వచ్చింది. తిరుగు ప్రయాణంలో భాగంగా శుక్రవారం ఉదయం నందిముస్లాయిగూడ నుంచి హైదర్‌గూడ బస్టాప్‌నకు నడుచుకుంటూ వస్తుంది. గోల్డెన్ ప్యాలెస్ హోటల్ సమీపంలో స్కూటీపై మంకీ క్యాప్‌లు ధరించి ఇద్దరు యువకులు నిర్మలమ్మ మెడలో ఉన్న ఆరు తులాల గొలుసు లాక్కుని పరారయ్యారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

షాబాద్: రోడ్డు ప్రమాదంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి చెందాడు. షాబాద్ సీఐ కాంతాం రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మాచన్‌పల్లికి చెందిన ఎఫ్ఏ కోళ్ల నర్సింహులు (45) షాబాద్‌లోని ఉపాధి హామీ కార్యాలయంలో విధులు ముగించుకొని శుక్రవారం రాత్రి స్వగ్రామానికి బైక్‌పై బయల్దేరాడు. తెలంగాణ మోడల్ స్కూల్ సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భారతి సిమెంట్‌కు తిరుగులేదు

సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్



బీమా బాండ్లను అందజేస్తున్న భారతిసిమెంట్ ప్రతినిధులు

అనంతగిరి: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్ తెలిపారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్దుల చిట్టంపల్లిలో శ్రీ వేంకటేశ్వర డీలర్ షాపులో శుక్రవారం రాత్రి తాపీమేస్త్రీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలకు సరైన ఎంపిక అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని స్లాబ్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారని తెలియచేశారు. ఈ సందర్భంగా తాపీమేస్త్రీలకు రూ.లక్షతో కూడిన ప్రమాద బీమా బాండ్లను 30 మందికి అందజేశారు. అనంతరం డీలర్ వెంకటేష్ మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో తాపీమేస్త్రీలు, వినియోగదారులు, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

80 మంది కార్మికుల తొలగింపు



సీసీఐ ఫ్యాక్టరీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

సీసీఐలో ఆందోళన చేపట్టిన వేతనజీవులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామ శివారులో ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఫ్యాక్టరీ ఎదుట కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఫ్యాక్టరీలోని ప్యాకింగ్ ప్లాంట్‌లో 80 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారు. దీనిని వ్యతిరేకంగా ఫ్యాక్టరీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ఉన్నట్టుండి ఒక్కసారిగా పనుల్లో నుంచి తొలగిస్తే మా జీవితాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ యాజమాన్యం కల్పించుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీసీఐ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరణప్ప మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులతో వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు కాంగ్రెస్ నాయకులు కూడా కార్మికులకు మద్దతు తెలిపారు.

విద్యారంగ బలోపేతం.. ఎస్టీఎఫ్ఐ లక్ష్యం



ఎస్టీఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

షాద్‌నగర్: ప్రభుత్వ విద్యారంగం బలోపేతమే స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్టీఎఫ్ఐ) లక్ష్యమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింహులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో ఫెడరేషన్ సీనియర్ నాయకుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎస్టీఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో భావసారూప్యత కలిగిన 25 సంఘాల టీచర్స్ యూనియన్లతో 2000 సంవత్సరంలో ఎస్టీఎఫ్ఐ ఏర్పడిందని తెలిపారు. విద్యారంగంలో శాస్త్రీయ విధానాలను అనుసరించడం, సరళీకృత ఆర్థిక విధానాల ద్వారా ప్రస్తుతం ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. వాటిని తగ్గించి రాజ్యాంగ, ప్రజాస్వామిక విలువలను కాపాడాలని సూచించారు. దేశవ్యాప్తంగా పాఠశాల విద్యకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కేంద్రం తెచ్చిన ఎన్‌పీఎస్, సీపీఎస్, యూపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్ఈపీ 2020 విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగం, ఉపాధ్యాయుల హక్కులను కాపాడాలనే లక్ష్యంతో ఈ నెల 8న కలకత్తాలో రజతోత్సవ సభలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు సత్యం, లక్ష్మీ దేవమ్మ, రామకృష్ణ, వినీత్‌గౌడ్, శివ, రాజు, జేవీవీ నాయకులు కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి

నందిగామ: ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రం నందిగామ, మామిడిపల్లి, మేకగూడ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ సంఘం మండల అధ్యక్షుడు జ్ఞానే శ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడారు. 2023 జూలై 1 నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీ.. రెండేళ్లు గడిచినా నివేదిక వెల్లడించలేదని ఆరోపించారు. వెంటనే నివేదికను బహిర్గతం చేయాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన ఫిట్మెంట్‌ను అమలు చేయాలన్నారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను విడుదల చేయాలని, జీపీఎస్‌లోన్లు, పార్ట్ ఫైనల్, టీజీజీఎల్ఐ ఫైనల్ పేమెంట్లు, సరెండర్ లీవ్స్ తదితర బిల్లులను విడుదల చేయాలన్నారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జ్ఞానేశ్వర్ రెడ్డి, హరిహోమ్, కొత్తూరు మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, సంఘం సభ్యులు కిష్టారెడ్డి, దామోదర్ రెడ్డి, వెంకటేశ్, జంగయ్య, సోము భూపాల్‌రెడ్డి, ఆనందం తదితరులు ఉన్నారు.

నూనె గింజల సాగుతో రాబడి



రైతులను సన్మానించిన డైరెక్టర్ మథుర్

షాబాద్: నూనె గింజల సాగుతో అధిక దిగుబడి సాధించడంతో పాటు.. లాభాలు అదే విధంగా పొందవచ్చని నూనె గింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ ఆర్.కె.మథుర్, కావేరి అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రవీణ్‌రావు అన్నారు. శుక్రవారం భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ రాజేంద్రనగర్‌లో 49వ ఫౌండేషన్ దినోత్సవం సందర్భంగా సాగుపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గింజల సాగుతో అధిక దిగుబడి సాధించిన తిర్మలాపూర్, మల్లారెడ్డిగూడ రైతులు సుగుణమ్మ, నర్సమ్మ, మాణిక్యంలను సన్మానించారు. అనంతరం సంస్థ నుంచి అధిక దిగుబడి ఇచ్చే కుసుమ రకాలు, ఆదాయ మార్గాల గురించి వివరించారు. కార్యక్రమంలో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, తిర్మలాపూర్, మల్లారెడ్డిగూడ, మిట్టకంకల్ రైతులు శ్రీనివాస్, మాణిక్యం, సుగుణమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌కు స్పాట్ అడ్మిషన్లు

కందుకూరు: కందుకూరు మండలం నేదునూరు మోడల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లను ఆహ్వానించామని ప్రిన్సిపాల్ విష్ణుప్రియ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 8 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంఈసీలో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉండి అర్హత గల విద్యార్థులు, ఈ నెల 4వ తేదీ ఉదయం 10 గంటల వరకు సర్టిఫికెట్లతో పాఠశాలకు రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కడ్తాల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్ మండలం వాసుదేవ్‌పూర్ గ్రామం చెన్నారం తండాకు చెందిన కేతావత్ దేశ్యా(46) గురువారం రాత్రి పదకొండున్నర గంటలకు కడ్తాల్ నుంచి గుర్ల కుంటతండాకు వెళ్లేందుకు జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో కల్వకుర్తి వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న ద్విచక్ర వాహనం దేశ్యాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, బాధితుడిని చికిత్స నిమిత్తం 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.